కొడంగల్ నియోజకవర్గంలో సిఎం పర్యటన

-పోలేపల్లి ఎల్లమ్మ దేవతను దర్శించుకోనున్న సిఎం

కొడంగల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శుక్రవారం కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. సిఎంపర్యటనకు సంబంధించి ఉన్నతాధికారులు అన్నిఏర్పాట్లు పూర్తిచేశారు. శుక్రవారం ఉదయం 11:30గంటలకు సిఎం రేవంత్‌రెడ్డి హైద్రాబాద్‌లోని బేగంపేటనుంచి హ్యెలిక్యాప్టర్‌లో బయలుదేరి 12గంటలకు కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాలమండలంలోని పోలేపల్లికు చేరుకుంటారు. మినీమేడారంగా పేరుగాంచిన పోలేపల్లిలో రేణుకా ఎల్లమ్మదేవత జాతరలో భాగంగా అమ్మవారిని దర్శించుకొన్న అనంతరం నారాయణపేట్ జిల్లాకు హ్యెలిక్యాప్టర్‌లో తరలివెళ్తారు. కాగా ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి మొదటిసారి పోలేపల్లి వస్తుండడంతో మల్టీజోన్-2 ఐజిపి వి.సత్యనారాయణ, జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఏర్పాట్లను పరిశీలించారు.

గంజాయి పట్టివేత కేసు నమోదు

ఆదిభట్ల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

విశ్వసనీయ సమాచారంమేరకు గంజాయి నేరస్థుడినిపట్టుకున్న ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్లో చోటుచేసుకుంది. ఆదిభట్ల పోలీస్‌స్టేషన్‌పరిధిలోని రాగన్నగూడగ్రామంలో నేరస్థుడు గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారంతో పోలీసులు పట్టుకున్నారు. ఆదిభట్ల సిఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మహమ్మద్ సమీర్ అలియాస్ ఫరీద్ (24) అచ్చంపేటగ్రామం నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన వ్యక్తి. ఫరీద్ ఇక్కడికి వచ్చి గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఇంతకుముందు కూడా వివిధ పోలీస్‌స్టేషన్లో అనేకనేరాలకు పాల్పడినట్లు, గంజాయి కేసులు కలిగి ఉన్నాడు. నేరస్థుడివద్ద నుండి 1.2 కేజీల గంజాయి, స్విఫ్ట్ కార్, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే శంకర్

సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

నేడు నారాయణపేట జిల్లా కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు రానున్న సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, వంశీకృష్ణ, వాకిటి శ్రీహరిలతో కలిసి సిఎంపర్యటన ఇంచార్జి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మీడియాసమావేశంలో పాల్గొని సిఎంపర్యటన వివరాలను వెల్లడించారు. ఈకార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్‌శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

జాతరలో పాల్గొన్న అసెంబ్లీ స్పీకర్



జాతరలో పాల్గొన్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

మున్సిపల్ పరిధిలోని ధన్నారంలో గడ్డమైసమ్మ జాతర ఉత్సవాల్లో గురువారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు. ఆయనరాకను పురస్కరించుకుని ఆలయనిర్వాహకులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారికి స్పీకర్ ప్రత్యేకపూజలు నిర్వహించి, భక్తులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం మైసమ్మదేవాలయం వరకు రూ.30లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ కిషన్‌నాయక్, నాయకులు రామచంద్రారెడ్డి, మల్లేశ్, రత్నారెడ్డి, సత్యనారాయణ, మహిపాల్‌రెడ్డి, చిగుళ్ళపల్లి రమేష్‌కుమార్, జె.వెంకట్‌రెడ్డి, జంగయ్య, దొడ్ల ఆనంద్, వెంకట్‌రాంరెడ్డి, రాజు, శ్రీకాంత్, రాకేష్, అమర్ పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ రీసర్వేను ఉపయోగించుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న బిసిసంఘం తాలూకా అధ్యక్షులు

కొడంగల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

బిసిసంఘాల అభ్యర్థన మేరకు తెలంగాణారాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రీసర్వే ఆదేశించడం పట్ల కొడంగల్ తాలూకా బిసిసంఘం అధ్యక్షులు మన్నె బస్వరాజ్‌యాదవ్, గవిని చంద్రశేఖర్‌లు హర్షం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర రీసర్వే చేస్తున్నందున ఇంతకుముందు చేసిన సర్వేలో పాల్గొనని వారు తమ పూర్తివివరాలను ఈనెల 28వరకు నమోదు చేసుకోవాలని కోరారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం సంబంధిత కార్యాలయాల దగ్గర ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో సిఎంగా కొనసాగిన చంద్రశేఖర్‌రావు స్థానికసంస్థల్లో బిసిలకు 34శాతం నుంచి 18శాతంకు తగ్గించి తీరని అన్యాయం చేశారని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీమేరకు బిసిలకు బడ్జెట్‌లో జనాభా దామాషాప్రకారం నిధులు కేటాయించాలని కోరారు. అలాగే వచ్చే స్థానికసంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్‌లు పెట్టిన అనంతరమే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.

ఆర్‌ఓబి పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని వినతి



జిల్లాకలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ మాజీచైర్‌పర్సన్ పావనిజంగయ్యయాదవ్

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వేవంతెన పనులు పూర్తిచేసేలా తగినచర్యలు తీసుకోవాలని ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ గురువారం మేడ్చల్ జిల్లాకలెక్టర్ గౌతమ్‌పొట్రును కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ-జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్‌బాబును కలవగా ఆయన ఆదేశాలమేరకు జిల్లాకలెక్టర్‌ను కలిసి సమస్యలపై వినతి సమర్పించినట్లు ఆమె తెలిపారు. రైల్వేవంతెనలో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న 14మంది బాధితులు కోర్టును ఆశ్రయించారని తగిన నష్టపరిహారం చెల్లించి న్యాయంచేయాలని కోరారు. ఆర్‌ఓబి పనులు ప్రారంభమై 12సంవత్సరాలు అవుతుందని కాంట్రాక్టర్‌కు పెండింగ్‌బిల్లులు విడుదలచేసి త్వరగా వంతెన పూర్తయ్యేలా చొరవచూపాలని విజ్ఞప్తిచేశారు. వంతెనపనుల కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు జరుగుతున్నాయని, దుమ్ము, ధూళితో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. గురుకుల్ విద్యాసంస్థకు 26ఎకరాల స్థలం ఉందని సర్వేచేసి ఆక్రమణలు తొలగించి కెజి నుంచి పిజి వరకు విద్యాబోధనా ఏర్పాటు చేయాలని కోరారు.

ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు కొరుబోతు నాగరాజు, డిసిసి కార్యదర్శి ఉల్లి అంజనేయులు, నాయకులు శశిధరణ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే చెప్పినా డోంట్ కేర్..?

-ఏకెఆర్ ఎర్త్ మూవర్స్‌కేసులో పోలీస్ వర్సెస్ రెవెన్యూ
-నిబంధనల ప్రకారం జరిమానాలు చెల్లించినా వదలని వాహనాలు
-ఎమ్మెల్యే ఫోన్ చేస్తే మా 'ఇగో' హర్టవుతుందంటున్న రెవెన్యూ అధికారి

షాద్‌నగర్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 20:

ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యమై ఎన్నో కార్యక్రమాలకు, అదేవిధంగా ముఖ్యమంత్రి పర్యటనకు వేదికలవద్ద మట్టిపనులు చేసే ఏకెఆర్ ఎర్త్‌మూవర్స్‌కు సంబంధించిన ఇటాచి వాహనం తోపాటు రెండువాహనాలను షాద్‌నగర్ పోలీసులు ఇటీవలే అదుపులోకి తీసుకున్నారు. ఏకెఆర్ ఎర్త్‌మూవర్స్ అధినేత అక్రమ్ కాంగ్రెస్ పార్టీలో యువ నాయకుడిగా చలామణి అవుతున్నారు. ఆయనకు సంబంధించినవే ఈవాహనాలు. పోలీసులు ఈవాహనాలను అదుపులోకి తీసుకోవడం మంచిపరిణామమే అయితే బాధితుడు నిబంధనల ప్రకారం వాటిని విడిపించుకునేందుకు రెవెన్యూ అధికారులు విధించిన జరిమానాలు చెల్లించి కూడా పోలీస్‌స్టేషన్‌చుట్టూ తిరుగుతుంటే ఈతతంగంలో ఓరెవెన్యూ అధికారిసైతం ఎమ్మెల్యేతో ఫోన్ చేయిస్తే మా ఇగో హర్ట్ అవుతుంది. నువ్వు ఎవరితో ఫోన్లు చేయించొద్దు, అలాచేస్తే ఇక్కడ పనిచేయమంటూ హుకుం జారీచేశారు. మాజీపల్లి రోడ్డులో పోలీసులు ఏకెఆర్ ఎర్త్‌మూవర్స్‌కు సంబంధించిన హిటాచీ వాహనంతోపాటు మరో రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకోగా వాటిని నిబంధనల ప్రకారం విడిపించుకునేందుకు బాధితుడు అక్రమ్‌కు అనేక ఆటంకాలు సృష్టిస్తూ అటురెవెన్యూ, ఇటుపోలీసు శాఖ ఇబ్బంది పెడుతున్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ పార్టీ కార్యకర్త వాహనాలు పట్టుకున్న పోలీసులు అభినందనీయులే. కానీ నిబంధనల ప్రకారం వాటిని జరిమానా కట్టి విడిపించుకునే క్రమంలో ఎందుకుజాప్యంచేస్తున్నారన్నది అర్థంకాని అంశం. ఈవ్యవహారంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులకు ఫోన్లుచేసి మరీ అభివృద్ధిపనుల్లో భాగస్వాములైనవారికి ఇబ్బందులు సృష్టించవద్దని చెప్పినప్పటికీ అధికారులు మాత్రం ఎమ్మెల్యే ఫోన్‌చేస్తే డోంట్ కేర్ అని చెబుతున్నారు. ఒకవేళ ఎమ్మెల్యే ఫోన్‌చేస్తే మా ఇగో హర్ట్ అవుతుందని స్వయంగా రెవెన్యూశాఖలో ఓ అధికారి అల్టిమేట్ జారీచేయడం గమనార్హం. ఏకెఆర్ మూవర్స్ ద్వారా సిఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా మొగిలిగిద్ద వద్ద ఈవాహనాల ద్వారా ఎన్నో మట్టిపనులు చేశారు. ప్రభుత్వ జూనియర్‌కళాశాల వద్ద జరిగే పనులకూ ఏకెఆర్‌మూవర్స్ అధినేత అక్రమ్ మట్టినిచ్చారు.

పోలీసులకు కూడా మట్టి సప్లై...

షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు అవసరమైన మట్టిని కూడా ఏకెఆర్‌మూవర్స్ సరఫరాచేసింది. పోలీస్ స్టేషన్‌లో రిసెప్షన్‌హాల్‌కుసంబంధించి మట్టిని ఉచితంగా ఇచ్చిందికూడా ఇదే సంస్థ. పోలీస్‌స్టేషన్‌లో మొక్కలకు వేసేందుకుకూడా వారే మట్టిని సరఫరాచేశారు. మరో ఉన్నతాధికారికూడా 15ట్రిప్పుల మట్టిని పోయించుకున్నారు. పోలీసులకు అప్పుడు కనిపించలేదా ఇది అక్రమం అని ఆరోపిస్తున్నారు. నందిగామ పోలీస్‌స్టేషన్‌కు 70ట్రిప్పుల మట్టిని ఇదేసంస్థ ఇచ్చింది.

మట్టిని సరఫరా చేస్తున్న ఏకెఆర్ ఎర్త్ మూవర్స్ వాహనం

సమస్యలున్న భూములకు భరోసా ఇవ్వని ప్రభుత్వం

-భరోసాకు దూరమైతున్న రైతన్న
-తప్పులతడకగా రెవిన్యూ రికార్డు
-పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోని అధికారులు
-అధికారుల తీరుపై భగ్గుమంటున్న రైతన్నలు



మాడ్గుల అధికార కార్యాలయం (ఫైల్ ఫోటో)

మాడ్గుల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

దేవుడు వరమందిస్తే పూజారి అడ్డుపడ్డాడన్న చందంగా మారింది రెవెన్యూ అధికారుల తీరు. ప్రత్యేక తెలంగాణరాష్ట్రం సిద్ధించినవెంటనే రైతులకు అండగా ఉండాలన్న లక్ష్యంతో నాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టారు. పతి ఎకరానికి రూ.ఎనిమిదివేలతో ఈపథకాన్ని ప్రారంభించినప్పటికీ అనతికాలంలోనే మరో రెండువేలు పెంచుతూ రెండు పంటలకుగాను రూ.పదివేలు రైతుఖాతాల్లో జమ చేస్తూ రైతుల మన్ననలు పొందారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల్లో హామీగా రూ.15వేలు ప్రకటించినప్పటికీ రాష్ట్రప్రభుత్వ ఖజానా దృష్టిలో ఉంచుకొని రూ.12వేలకు కుదించారు. అయినప్పటికీ అధికారుల నిరక్ష్యం కారణంగా చాలామంది రైతులకు డబ్బు జమకావడం లేదని ఆందోళన చెందుతున్నారు. పలు సర్వేనెంబర్లు హెచ్చుతగ్గులు చూపిన అధికారులు మాడ్గుల మండలంలోని పలుగ్రామాలలో రెవిన్యూ అధికారుల నిరక్ష్యంతో పలు సర్వేనెంబర్‌లలో ఉండాల్సిన భూమి కన్నా ఎక్కువతక్కువలు చూపిస్తూ ధరణి రికార్డులలో ఎక్కించారు. తద్వారా ప్రభుత్వం ఆసర్వేనెంబర్లకు రైతుభరోసా ఇవ్వడంలేదు. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రంలో మూడు ఎకరాలవరకు రైతుభరోసా నిధులు విడుదలచేసి రైతుఖాతాలో జమ చేసినప్పటికీ పలు సర్వేనెంబర్లలో చిన్న,సన్నకారు రైతులు ఉన్నప్పటికీ వారికి రైతుభరోసా సొమ్ము జమ కావడంలేదు. మండలంలోని పలుగ్రామాల

ఆర్‌ఎస్‌ఆర్‌రికార్డును పరిశీలించినట్లయితే...

మండలంలోని అందుగుల రెవిన్యూ పరిశీలిద్దాం.. 5538.14 ఎకరాలకుగాను 5242.04 ఎకరాలు రికార్డ్‌నమోదయింది. అందులోనూ 73సర్వేనెంబరులో 0.13గుంటలభూమి అదనంగా ఉండడంతో రైతుభరోసా అందలేదు. సర్వేనెంబర్ 111లో 34 గుంటలు, 169లో 1.19గుంటలు, 186లో ఒక గుంట, 205లో నాలుగుఎకరాలు, 255ఎకరం, 304లో 728గంటలు, 306లో 3.11గుంటలు, 307లో 5.1ఎకరాలు.. ఇలా పలుసర్వేనెంబర్లలో భూమి అదనంగా ఉండడంతో రైతులకు రైతుభరోసా అందడంలేదు. అర్కపల్లి రెవిన్యూగ్రామంలో సర్వేనెంబర్ 21లో తన భూమి ఆర్‌ఎస్‌ఆర్‌లో మిగిలి ఉన్నప్పటికీ పలుసార్లు దరఖాస్తు చేసుకున్నా ఎక్కించడంలో అధికారుల నిరక్ష్యం వహిస్తున్నారని రైతు నాగం ధర్మారెడ్డి ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. సర్వేనెంబర్ 28లో 4.18 గుంటలు, సర్వేనెంబర్ 39లో 7ఎకరాలు, సర్వేనెంబర్ 42లో 9.17గుంటలు, సర్వేనెంబర్41లో 1.15గుంటలు, సర్వేనెంబర్ 92లో 3.11 గుంటలు, సర్వేనెంబర్ 155లో మూడుగుంటలు, 196లో 2.21 అదనంగా రికార్డు నమోదుచేసి రైతులకు రైతుభరోసా అందకుండా చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అర్కపల్లిరెవిన్యూ గ్రామంలో 5819.22 ఎకరాలకుగాను 5629 ఎకరాల,ఏడుగుంటలు ఆర్‌ఎస్‌ఆర్‌లో నమోదయింది. అవురుపల్లిరెవిన్యూగ్రామంలో 3989.16 గుంటలకుగాను 3985ఎకరాలు నమోదుచేశారు, బ్రాహ్మణపల్లి రెవెన్యూపరిధిలో 2999.17ఎకరాలకుగాను 2975ఎకరాలు ఆర్‌ఎస్‌ఎస్‌లో నమోదు చేశారు, దొడ్లపాడులో 1045.23గుంటలకుగాను 1031.23గుంటల భూమిని నమోదుచేశారు. గిరికొత్తపల్లి రెవిన్యూ గ్రామపరిధిలో 2853.36 గుంటలకుగాను 2731ఎకరాలు నమోదుచేశారు. ఇర్వేన్‌రెవిన్యూ గ్రామపరిధిలో 11006.12 గుంటలకుగాను 10695.12 ఎకరాలభూమి నమోదు చేశారు. కలకొండరెవెన్యూ గ్రామ7051.29ఎకరాలకుగాను 6952.32 ఎకరాలు నమోదు చేశారు. కొలుకులపల్లిగ్రామ రెవెన్యూ పరిధిలో 2424.01 ఎకరాలకుగాను 2371.38ఎకరాలు నమోదయింది. మాడుగుల మండల కేంద్రంలో 9745.25 ఎకరాలకుగాను 9600.12 ఎకరాలు ఆర్‌ఎస్‌ఆర్ రికార్డు నమోదు చేశారు. నాగిళ్లలో 5290.06 ఎకరాలకుగాను 5277.37ఎకరాలు రికార్డుల్లో ఉంది. రమణంపల్లిరెవెన్యూ గ్రామంలో 760.35 ఎకరాలకుగాను 750.30 నమోదుచేశారు. సుద్దపల్లిరెవెన్యూ గ్రామంలోని 872.31ఎకరాలకుగాను 874.32ఎకరాలు రికార్డు నమోదుచేశారు. అప్పారెడ్డిపల్లి రెవిన్యూగ్రామంలో 5798.38ఎకరాలకుగాను 6267ఎకరాలు ఆర్‌ఎస్‌ఎల్‌లో నమోదయింది. కాగా ఒక్క అప్పారెడ్డిపల్లిగ్రామం రెవెన్యూలోనే ఏకంగా 468.2 ఆర్‌ఎస్‌ఆర్‌లో అదనంగా చూపించారు. అయితే పలు సర్వేనెంబర్లు హెచ్చుతగ్గలున్నప్పటికీ గ్రామ ఆర్‌ఎస్‌ఆర్ పూర్తి అయ్యేసరికి తక్కువ చూపిస్తూ సమస్యలేనట్టుగానే చూపించినట్లు తెలుస్తుంది. మండలంలోని పలు గ్రామాల్లో అప్పటి వీఆర్వోలు తమఇష్టానుసారంగా రికార్డులు నమోదుచేస్తూ సర్వేనెంబర్లలో హెచ్చుతగ్గలకు కారణమయ్యారు. మండలంలోని అప్పారెడ్డిపల్లిలో సర్వేనెంబర్ 65లో ఇష్టానుసారంగా కాసులు ఇస్తే చాలు కనికరించారు. ఏకంగా 400 పైచిలుకు ఎకరాలని అదనంగా భూములులేకున్నా రైతులకు పట్టాలిచ్చారు. మరికొన్నిగ్రామాలలో ఒకే రైతుపేరు రెండుసార్లు నమోదుచేస్తూ సర్వేనెంబరు అదనంగా పెరగడానికి కారణమైందని రైతులు అంటున్నారు. అప్పటి వీఆర్వో చేసిన పొరపాటు ధరణిలో వచ్చిన సమస్యలని పరిష్కరించడంలో ఇప్పటి అధికారులకు పలుమార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ పరిష్కరించకపోవడంతో రైతులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. పరిష్కరించడానికి అవకాశం ఉన్నా అధికారులు ఎందుకు పరిష్కరించడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు.

సమస్యలు ఉన్న సర్వేనెంబర్లకు రైతుభరోసా ఇవ్వని ప్రభుత్వం...

మండలంలోని పలుగ్రామాలలో సర్వేనెంబర్లలో భూమి హెచ్చుతగ్గులు ఉన్న భూములకు ప్రభుత్వం రైతుభరోసా ఇవ్వడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. అయితే అధికారులుచేసిన పొరపాటులకు రైతులు ఇబ్బందులు పడవలసిందేనా.. ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో సమస్యలు పరిష్కరించి సరైన లబ్దిదారులకు రైతుభరోసా అందజేయాలని రైతులు కోరుతున్నారు.

భూమి పంచారు సరే.. మిగిలింది ఏమైంది..?

షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

షాద్‌నగర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

ఫరూఖ్‌నగర్ మండలకేంద్రం శివారులో సర్వేనెంబరు 171 లో ఉన్న ప్రభుత్వభూమి అన్యాక్రాంతమవుతుందని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆరోపించారు. పట్టణంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రికార్డు ప్రకారంగా గతంలో ఈభూమిలో నుంచి జర్నలిస్టులైన శేఖర్ రెడ్డి, పేపర్ ప్రకాష్, అంజయ్య, సుభాన్ అలీలకు ప్లాట్లు ఇచ్చారని, అదేవిధంగా గొర్రెలకాపరుల సంఘానికి కొంతస్థలం కేటాయించారని గుర్తుచేశారు. అయితే మిగతా స్థలం చాలా వరకు ఆక్రమణకు గురైందని ఆరోపించారు. స్థలాన్ని పొందిన కొందరువ్యక్తులు కూడా మరింత స్థలాన్ని ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. దీనిని అధికారులు గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వభూమిలో అందరికీ హక్కు ఉంటుందని, ప్రభుత్వం అధీనంలోకి తీసుకున్న స్థలాన్ని అర్హులైన ఇతరులకు పంచితే సరైన న్యాయం జరుగుతుందని వెల్లడించారు. ఇతర వ్యక్తులు ఆక్రమించుకున్న స్థలాలను స్వాధీనంలోకి తీసుకుంటే ఎప్పటి నుంచో ప్లాట్లు కావాలని కోరుతున్న జర్నలిస్టులకు గానీ, ప్రభుత్వ భవనాలకు గానీ ఉపయోగించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.

ప్రభుత్వ భూమి వివరాలను వెల్లడిస్తున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

చేగూరులో మంత్రి కొండా సురేఖకు ఘనస్వాగతం

-శాలువవేసి స్వాగతించిన మాజీ ఎంపిపి శివశంకర్‌గౌడ్

నందిగామ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

రంగారెడ్డిజిల్లా నందిగామమండలం చేగూరు కన్హా శాంతివనానికి గురువారం విచ్చేసిన తెలంగాణ మంత్రివర్యులు కొండా సురేఖకు కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. తమ అభిమాననేత చేగూరు ముఖద్వారానికి రాగానే ఉమ్మడిమండలాల మాజీ ఎంపిపి ఎం శివశంకర్‌గౌడ్ మంత్రికి శాలువా కప్పి సన్మానించి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖను ఆహ్వానిస్తున్న మాజీ ఎంపిపి శివశంకర్‌గౌడ్

గురుకుల్ అభివృద్ధికి అఖిలపక్ష నిర్ణయం

అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

ఘట్‌కేసర్ గురుకుల్ విద్యాసంస్థ అభివృద్ధికి కలిసి పోరాటం చేయాలని అఖిలపక్షం నిర్ణయించింది. ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బాసాని యాదగిరియాదవ్ పిలుపుమేరకు ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలోని రాజకీయపార్టీల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గురుకుల్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు తీసుకోవాల్సిన కార్యాచరణపై నాయకులు చర్చించారు. అఖిలపక్ష నాయకులు గురుకుల్ విషయంలో చర్చలు జరిపి ఆయా పార్టీల ద్వారా ఉత్తరాలు వేయాలని నిర్ణయించారు. ఈసమావేశంలో సిపిఎం నాయకులు చింతల యాదయ్య, నార్కట్‌పల్లి సభిత, సిపిఐ నాయకులు కల్లూరి జయచంద్ర, లొట్టి ఈశ్వర్, మున్సిపల్ బిఆర్‌ఎస్‌పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్, బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, టిడిపి మాజీ అధ్యక్షులు వేముల సంజీవగౌడ్, మాజీ వార్డుసభ్యులు కొత్త కొండ వెంకటేశ్, నాయకులు శశిధరణ్, బచ్చు నగేశ్‌గుప్త, ఎడమ ప్రసన్నలు పాల్గొన్నారు.

ఆ రాత్రి కాళీరాత్రి..!

-అనుక్షణం భయంతో నిద్రలేనిరాత్రులు గడిపిన తాటిగడ్డతండా గిరిజనం

నందిగామ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

నందిగామ మండలం సిడితండా గ్రామపంచాయతీ పరిధిలోని తాటిగడ్డతండ కాళరాత్రిని తలపించింది. బుధవారం అర్ధరాత్రి గ్రామ సమీపంలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ దగ్ధమై భయంకరమైన మంటలు రేగాయి. దీంతో అటుగా వెళ్లే రాకపోకలు సాగించే వాహనదారులు, గిరిజనులు భయకంపితులైనట్లు ఆ ప్రాంతప్రజలు భయాందోళన వ్యక్తం చేశారు. కరెంటు నిలిచిపోవడంతో దోమల బాధతో జనం ఆరాత్రి నిద్రలేమికి గురై కాళరాత్రిని తలపించినట్లు గిరిజనులు ఆవేదన వ్యక్తంచేశారు. ఇంత జరిగినా సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులుగానీ, సిబ్బందిగాని పట్టించుకోలేదని ఆతండా గిరిజన నాయకులు జటావత్ విజయ్‌నాయక్, సోమ్లానాయక్‌లు కరెంటు సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మతతత్వ, నిరంకుశవాద శక్తులను తరిమికొట్టాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఈ.టి.నర్సింహ్మా

సైఫాబాద్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: మతతత్వం, నిరంకుశవాద శక్తులు ప్రాతినిధ్యం వహిస్తున్న మితవాద దాడిని తిప్పికొట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈ.టి.నర్సింహ్మా పిలు పునిచ్చారు. ఈ శక్తులను సమర్థవంతంగా ఎదుర్కొనడానికి పార్టీని మరింతగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు గురువారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగ రక్షణకై నవ-ఉదారవాద విధానాలు,మతతత్వం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడటానికి ప్రజలను సమీకరించవలసిన అవసరం ఉందన్నారు. దీనికోసం ప్రజా మార్గాన్ని స్వీకరించి ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు ఏర్పరుచుకుని, ప్రజా ఉద్యమాలను అభివృద్ధి చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, నాయకులు చందునాయక్, స్టాలిన్, నెర్లకంటి శ్రీకాంత్, కంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్నిదానాలల్లో కెల్లా విద్యాదానమే గొప్పది : రంగారావు

సరస్వతి విద్యామందిర్‌లో చదువుతున్న పేద విద్యార్థులకు ఫీజును అందిస్తున్న వడ్డేపల్లి రంగారావు

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

నిరుపేదల విద్యార్థులకు విద్యాదానం చేయటం ద్వారా ఆత్మ సంతృప్తి కలుగుతుందని వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ వైస్ ఛైర్మన్ వడ్డేపల్లి రంగారావు అన్నారు. చందానగర్‌లోని సరస్వతీ విద్యామందిర్‌లో చదువుతూ.. ఆర్థికంగా వెనుకబడి ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న నలుగురు విద్యార్థులకు వడ్డేపల్లి రంగారావు ఫీజుల వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు ఉన్నత చదువులు చదివించుకునే స్తోమతలేని వారికి తమవంతు ఇతోధిక సహాయం చేయటం బాధ్యతగా భావిస్తున్నామన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా సరస్వతి విద్యామందిర్ పాఠశాలలో నిరుపేదలకు విద్యా బుద్ధులు అందించటం గొప్పవిషయమన్నారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచే చదువుతో పాటు సంస్కారం, సంస్కృతి నేర్పిస్తున్న సరస్వతి విద్యామందిర్ పాఠశాలకు తనవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నరేంద్రప్రసాద్,స్కూల్ జాయింట్ శెక్రటరీ రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయండి

-ఎఐసిసి సభ్యురాలు డా.కోట నీలిమ

సింధీ కాలనీ సిల్వర్ జూబ్లీ అపార్ట్‌మెంట్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న కోట నీలిమ.

బేగంపేట ఫిబ్రవరి 20,ప్రభాతవార్త

ప్రతి కార్యకర్త,నాయకులు చేయి చేయి కలిపి కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి,ఏఐసీసీ సభ్యురాలు డా.కోట నీలిమ అన్నారు .గురువారం సనత్‌నగర్ నియోజకవర్గం సింధి కాలనీలోని సిల్వర్ జూబ్లీ అపార్ట్‌మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమీక్షా సమావేశం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్నా డా.కోట నీలిమ మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం చేపట్టాక ఎన్నో సంక్షేమ పథకాలను అమలులోకి తీసుకువచ్చిందన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒకటొకటిగా అమలు చేస్తుందన్నారు.అలాగే ప్రతి బూత్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఆమె పిలుపు నిచ్చారు. కష్టపడి పార్టీ అభివృద్ధికి పనిచేసే కార్యకర్తలను తగిన విధంగా పార్టీ సత్కరిస్తుందన్నారు.రానున్న కమిటీలలో కష్ట పడి పనిచేసే కార్యకర్తలకు మొదటి ప్రాధాన్యత దక్కనుందన్నారు.సనత్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ ఎంతో బలంగా ఉందన్నారు.రానున్న రోజుల్లో ప్రతి ఒక్క డివిజన్‌లోని సమస్యలను గుర్తించి ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు చేపట్టేలా చూస్తామని కోట నీలిమ అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు విశాల్ సుధాం,గౌరపల్లి రమేష్,దర్గ కరుణాకర్,హనీఫ్,చిరంజీవి,మునీర్,కృష్ణ,జగదీష్,శేఖర్,మనోజ్, పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాల్లో డిఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

-సిబ్బంది పనివేళలు పాటించాలని ఆదేశం

బస్తీదవాఖానాల్లో సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి

హైదరాబాద్,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త:

జిల్లాలోని అన్ని బస్తీ దవాఖానాలు నిర్ణీత పనివేళలు పాటించి రోగులకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి సంబంధిత వైద్యులకు సూచించారు. ఈమేరకు గురువారం జిల్లాలోని పలు బస్తీ దవాఖానాల్లో పర్యటించి అక్కడ అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, చికిత్సలు , వసతులు, మందులునిల్వలు పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్, సిబ్బంది నిర్వహిస్తున్న రికార్డులనూ పరిశీలించి అందించిన సేవలు ఎప్పటికప్పుడు రికార్డులల్లో నమోదు చేయాలన్నారు. అలాగే బస్తీ దవాఖానా ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి,పారి శుద్ధ్యం మెరుగు పరచాలని సూచించారు.

సమాజాన్ని చైతన్యం చేయటంలో కవుల పాత్రకీలకం : జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

సమాజాన్ని చైతన్యచేయటంలో కవులు, కళాకారుల పాత్ర కీలకమైనదని శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు ట్యాగ్‌లైన్ కింగ్ డాక్టర్ ఆలపాటి ఆధ్వర్యంలో శేరసం ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమం,కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. సమాజాన్ని నిత్యం చైతన్యవంతం చేయటానికి కవులు, కళాకారుల రచనలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కూడా కవులు, కళాకారుల పాత్ర గొప్పదని ఆయన గుర్తుచేశారు. ఒక అక్షరం లక్ష మెదళ్ల కదలికయని ప్రజాకవి కాళోజీ అన్న మాటలు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కదిలేది, కదిలించేది కవిత్వమని ఆయన అన్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గంలో ఉన్న కవులు, కళాకారులకు తమవంతు సహాయ,సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో భాగంగా కవిశ్రీ సత్తిబాబు రచించిన ప్రయాణం బాల్యం నుంచి అనే కవితా సంపుటిని జగదీశ్వర్‌గౌడ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. శేరిలింగంపల్లి రచయితల సంఘం ఉపాధ్యక్షుడు జేవీ కుమార్ చేపూరి తొలిపలుకులతో సభ ప్రారంభం కాగా ప్రముఖ కవి,రచయిత వసీరా కవితా సంపుటిని సమీక్షించారు. శేరిలింగంపల్లి రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ మోటూరి నారాయణరావు సమయస్వయంతో ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవీంద్రబాబు అరవా నిర్వాహణలో కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కవి సమ్మేళనంలో శేరిలింగంపల్లి కవులు పావనేవ్వరి నిమ్మగడ్డ,సుమచంద్ర,కొలచన విజయభారతి, సిహెచ్ ఉషారాణి, రావినూతన జగదీశ్వరి, డాక్టర్ రమ్య స్వరూప్, ముడుంబై మంజులరాణి, మల్కాని విజయలక్ష్మీ,చంద్రప్రకాశ్ గుప్త, విశ్వనాథరెడ్డి,గూండ్ల నారాయణ, మాచవోలు శ్రీధర్‌రావు, భమిడిపాటి వెంకటేశ్వర రావు,డాక్టర్‌గోగు వెంకటేశ్ వర్లు, ఎంవీ చంద్రశేఖర్‌రావు, కవిశ్రీసత్తిబాబులు హాజరై తమ కవిత్వాన్ని వినిపించారు.శేరసం కోశాధికారి భీమా శ్రీనివాస్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు యం.రఘునందన్‌రెడ్డి,ఉరిటి వెంకట్రావు,ప్రభాకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్వర్‌గౌడ్ చేతుల మీదుగా కవితాసంపుటి అవిష్కరణ

కమిషనర్ హామీతో సమ్మె తాత్కాలిక విరమణ : ఎఐటియుసి నేత నర్సింహ్మా

సైఫాబాద్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: రెండోవ ఎఎన్‌ఎంల సమస్యలు పరిష్కారానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఇచ్చినహామీతో తాత్కాలికంగా సమ్మెను విరమించుకోవడం జరిగిందని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.నర్సింహ్మా తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రెండోవ ఎఎన్‌ఎంల యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌తో గురువారం జరిగిన చర్చల్లో వారి సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో సమ్మెను తాత్కాలికంగా విరమణ చేశామని ఆయన తెలిపారు. కోఠిలోని కమిషనర్ కార్యాలయంలో జరిగిన చర్చల్లో ఎఎన్‌ఎంల పోస్టుల పెంపు, పిహెచ్సిలలో ఓపిఎఎన్‌ఎం, అర్బన్ పిహెచ్సిలలో రెగ్యులర్, ఎఎన్‌ఎం పోస్టులను మంజూరుపైన, పరీక్ష రాయడానికి అర్హత లేని ఎఎన్‌ఎంలకు రిటైర్‌మెంట్ అయిన తరువాత బెనిఫిట్, 100 శాతం గ్రాస్ శాలరీని అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న 7 నెలల పిఆర్సీ బకాయిలను, సబ్ సెంటర్ బకాయిలను మార్చి 31వ తేదీలోగా చెల్లిస్తామని కమీషనర్ హామీ ఇచ్చారని నర్సింహ్మా చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రెండోవ ఎఎన్‌ఎంల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తోట రామాంజనేయులు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జక్కుల పద్మ, బోయిని శ్యామల, ఉపాధ్యక్షులు తన్వీనర్ సుల్తానా, రత్నకుమారి, జయమ్మ, గిరిజారెడ్డి, గీతారాణి, పార్వతి, సంధ్యారాణి, గోపమ్మ, గోపమ్మ, కృష్ణవేణి, శైలజ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. తొలుత వారు కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎం.నర్సింహ్మా, రామాంజనేయులు

ఒ.యూ అకడమిక్..శిక్షణ భాగస్వామ్యం కోసం ఎసిసిఎతో చర్చలు

తార్నాక, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :

ఉస్మానియా యూనివర్శిటీ తో అకడమిక్, శిక్షణ భాగస్వామ్యం కోసం ఆస్ట్రేలియా సర్టిఫైడ్ అకౌంటెంట్స్ (ఏసీసీఏ) చర్చలు.ఆస్ట్రేలియా సర్టిఫైడ్ ఛార్టెడ్ అకౌంటెంట్స్ (ఏసీసీఏ) ప్రతినిధి బృందం ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం, రిజిస్ట్రార్ ఆచార్య నరేష్ రెడ్డితో పాటు కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ అధ్యాపకులతో భేటి ఆయ్యారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంతో కలిసి పనిచేయటంతో పాటు పలు రంగాల్లో పరస్పర అవగాహన ఒప్పందం కోసం ఉన్న అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉస్మానియా ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం ప్రతిధిధులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు ప్రపంచస్థాయి నైపుణ్యాలతో శిక్షణ ఇచ్చేందుకు ప్రపంచస్థాయి సంస్థలతో భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. పరిశ్రమ, అకడమిక్ మధ్య ఉన్న గ్యాప్ ను పూడ్చేందుకు ఇలాంటి చర్చలు అవసరమని... ఆస్ట్రేలియా సర్టిఫైడ్ చార్టెడ్ అకౌంటెంట్స్ .. ఏసీసీఏ తో మరిన్ని విస్తృత చర్చలు జరుపుతామని పరస్పరం భాగస్వామ్యంతో కలిసి పనిచేద్దామని అన్నారు. ఉస్మానియా లాంటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయంతో కలిసిపనిచేసేందుకు తాము ఉత్సాహంగా ఉన్నామని భారతీయ వ్యవహారాల డైరెక్టర్ మోహమ్మద్ సాజిద్ ఖాన్ తెలిపారు.ఈ సమావేశంలో ఏసీసీఏ ప్రతినిధులుగా మోహమ్మద్ సాజిద్ ఖాన్, డైరెక్టర్ - ఇండియా, మిస్టర్ ప్రభాంషు మిట్టల్, హెడ్ ఆఫ్ ఎడ్యుకేషన్ పార్టనర్ రిలేషన్‌షిప్స్, మిసెస్ ఆల్థియా లీ, ఎడ్యుకేషన్ పార్టనర్ రిలేషన్‌షిప్స్ లీడ్ (సౌత్), మిస్టర్ రోయిస్టన్ ఎబెన్నేజర్, బిజినెస్ రిలేషన్‌షిప్స్ మేనేజర్ పాల్గొన్నారు.ఉస్మానియా యూనివర్శిటీ నుంచి ప్రొఫెసర్ కే. కృష్ణ చైతన్య, డీన్, ఫాకల్టీ ఆఫ్ కామర్స్, ప్రొఫెసర్ ఎం. గంగాధర్, హెడ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్, ప్రొఫెసర్ ఎ. ప్యాట్రిక్, ఛైర్మన్, బోర్డ్ ఆఫ్ స్టడీస్, ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్, ప్రిన్సిపల్, యూనివర్శిటీ కళాశాల ఆఫ్ కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ప్రొఫెసర్ సి. వీ. రంజని, ప్రొఫెసర్ ఎస్. కవితా దేవి, డాక్టర్ బి. సంద్యా ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎసిసిఎ బృందంతో ఒ.యూ ఉపకులపతి ప్రొ.కుమార్ మొలుగరం, రిజిస్టార్ ప్రొ. నరేష్ రెడ్డి

వైద్య వృత్తిలో అత్యాధునిక విధానం అవసరం

-సూపరింటెండెంట్ రాజ్‌కుమారి

కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ రాజ్‌కుమారి తదితరులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలోని రీజినల్ ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్ శిక్షణ కార్యక్రమాన్ని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి కళాశాల ప్రిన్సిపాల్ డా.ఇందిరతో కలిసి ప్రారంభించారు. ఈ సదర్భంగా ఆమే మాట్లాడుతూ వైద్య విద్యలో ప్రపంచవ్యాప్తంగా అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. వైద్య విద్య బోధనలో ఆధునిక పద్ధతులను పాటించాలని, అందుకోసం అధ్యాపకులు కూడా తగిన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు తెలంగాణలోని 60 మెడికల్ కళాశాలలను మూడు రీజియన్‌లుగా విభజించారని, గాంధీ మెడికల్ కళాశాల కూడా ఒక రీజనల్ కేంద్రంగా ఉన్నదని తెలిపారు. తమ పరిధిలో ఉన్న 25 వైద్య కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్స్, అధ్యాపకులతో తాము ఈ శిక్షణ ఏర్పాటు చేశామని వివరించారు. వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు మార్కులు మాత్రమే కాకుండా వారి కమ్యూనికేషన్స్ కూడా మెరుగుపర్చుకోవాలని, ఇందుకోసం నూతన బోధన పద్ధతులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సుబోద్ కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే.రవి శేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీ యువపురస్కారానికి ఆహ్వానం

నిజాంపేట్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, రంగస్థల కళలశాఖ ప్రతి సంవత్సరం మార్చి, 27న ప్రపంచ రంగస్థల దినోత్సవం జరుపుకుంటుంది. దానిలో భాగంగా జె. ఎల్.నర్సింహారావు పేరు మీద యువ పురస్కార ప్రదానోత్సవం జరుగుతుంది. నాటక రంగంలో వివిధ రంగాలలో అంటే నటన, దర్శకత్వం, మేకప్, లైటింగ్, సెట్ ఇంకా ఇతర సాంకేతిక అంశాల్లో కృషి చేసిన 35 సంవత్సరాల లోపు యువతి, యువకులు ఈ పురస్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చును. రిజిస్ట్రార్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, బాచుపల్లి వారికి పోస్టు ద్వారా కాని స్వయంగా కానీ సంబంధిత వివరాలతో దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేది. 10.3.2025గా తెలియజేయడమైనది.

ఢిల్లీ సిఎంగా రేఖాగుప్తా బాధ్యతలు చేపట్టడం గర్వకారణం

-ఆర్యవైశ్య మహాసభ జాతీయ సలహాదారులు కొటికె విఠల్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: ఢిల్లీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సభ్యురాలైన రేఖాగుప్తా బాధ్యతలను స్వీకరించడం గర్వకారణంగా ఉందని ఆర్యవైశ్య మహాసభ జాతీయ సలహాదారులు కొటికె విఠల్ అన్నారు. న్యాయశాస్త్రంలో పట్టభద్రురాలైన ఆమె, విద్యార్థి నాయకురాలిగా, లేడీటైగర్‌గా ఎంతో పేరును సంపాదించారన్నారు.వైశ్య జాతికే వన్నె తెచ్చిన మహా నాయకురాలు రేఖాగుప్తా అని పేర్కొన్నారు. సంఘ్ మహిళా సంబంధిత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారని, ప్రస్తుతం బిజెపి మహిళామోర్చ జాతీయ ఉపాధ్యక్షురాలిగా, పార్టీ జాతీయ కార్యవర్గసభ్యురాలిగా ఉన్నారన్నారు. బిజెపి నుంచి సుష్మాస్వరాజ్, ఉమాభారతి, వసుంధర రాజే, అనందీబెన్ పటేల్‌ల తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టిన ఐదవ మహిళగా, దేశంలో విభిన్న పార్టీల నుంచి సిఎం పదవిని చేపట్టిన 18వ మహిళగా రేఖాగుప్తా పేరును సంపాదించారన్నారు.

ఎన్ఆర్ఇజిఎస్ అమలు, అవకాశాలుపై సెమినార్

అత్తాపూర్ ఫిబ్రవరి20,ప్రభాతవార్త :

రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్‌డి, పిఆర్‌లో "మహాత్మా గాంధీ ఎన్ఆర్ఇజిఎస్ అమలు, అవకాశాలు సవాళ్లు" అనే అంశంపై రెండు రోజుల సెమినార్ ప్రారంభమైంది. గురువారం ఎన్ఐఆర్డి పిఆర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీంద్ర గవాలి,సీనియర్ రీసెర్చ్ ఫెలో డాక్టర్ సుధా నారాయణన్ పలువురు ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జీవనోపాధి, వాతావరణ స్థితిస్థాపకత, డిజిటల్ గవర్నెన్స్, స్కిల్ డెవలప్మెంట్, జెండర్ ఈక్విటీ మరియు ఎస్డిజి (సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్) సహా ఆరు ఇతివృత్తాలపై దేశవ్యాప్తంగా ఉన్న పండితులు మరియు అభ్యాసకులు పత్రాలను సమర్పించి చర్చించారు. అనంతరం ఐఎఫ్పిఆర్ఐకి చెందిన సీనియర్ రీసెర్చ్ ఫెలో డాక్టర్ సుధా నారాయణన్ మాట్లాడుతూ...మహాత్మా గాంధీ ఎన్ఆర్ఇజిఎస్ గతం, వర్తమానం, భవిష్యత్తు గురించి పలు సూచనలు చేశారు.సెమినార్ యొక్క రోడ్డు మ్యాప్‌ను రూపొందించారు.ఈ సమావేశంలో నైరూప్య పుస్తకాన్ని కూడా పలువురు ప్రతినిధులు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ వేజ్ ఎంప్లాయిమెంట్ అండ్ లైవ్లీహుడ్స్ (సిడబ్ల్యుఇఎల్) ఎన్ఐఆర్డి పిఆర్ కు చెందిన డాక్టర్ సోనాల్ మొబర్ రాయ్, డాక్టర్ సి. ధీరజ, డాక్టర్ దిగంబర్ ,ఎ. చిమాంకర్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు స్కాలర్‌షిప్ చెక్కులు పంపిణీ

జీడిమెట్ల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త

బహదూర్ పల్లిలోని కెఎం.పాండు ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజ్ ఆవరణలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మలబార్ నేషనల్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై 337 మంది విద్యార్థినిలకు ఒక్కొక్కరికి పదివేల రూపాయల చొప్పున 26.72 లక్షల రూపాయల విలువగల స్కాలర్ షిప్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ ప్రపంచాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన సాధనం విద్య అని, ఆడపిల్ల విద్యాభివృద్ధితోనే కుటుంబం ఆర్థిక పరిపుష్టిని సాధిస్తుందని నమ్మి ఆడపిల్లల విద్యకై జాతీయ స్థాయి స్కాలర్ షిప్ కార్యక్రమాన్ని మహిళల సాధికారతకై మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వారు చేపట్టడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ జోనల్ హెడ్ షణీబ్.కె, కూకట్ పల్లి స్టోర్ మేనేజర్ మహమ్మద్ ఇర్ఫాన్, కె.పి.హెచ్.బి స్టోర్ మేనేజర్ శ్రీనివాస్. కెఎన్, మార్కెటింగ్ హెడ్ రాకేష్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జాయిన్ సెక్రెటరీ డాక్టర్ ఆర్. జోత్స్న రాణి, కుత్బుల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ, ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ షేక్ మైమూన్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ నాగేంద్రరావు, కూకట్పల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ వెంకటయ్య, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, దుండిగల్ మాజీ కౌన్సిలర్లు నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, మల్లేష్, సీనియర్ నాయకులు సగ్గిడి శ్రీనివాస్, మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు శ్రీకాంత్, మైసిగారి శ్రావణ్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

మలబార్ నేషనల్ స్కాలర్షిప్ ప్రోగ్రాంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద

ప్రతి ఒక్కరు చేనేతవస్త్రాలు ధరించాలి

-కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, చిత్రంలో తమిళనాడు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఆర్.గాంధీ తదితరులున్నారు.

చిక్కడపల్లి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరు వారంలో ఒకరోజు చేనేతవస్త్రాలు ధరించాలని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి అన్నారు. దేశంలో వ్యవసాయ రంగం తరువాత అత్యధిక కార్మికులు పనిచేస్తున్న రంగం ఏదైనా ఉందంటే అది చేనేత రంగమని ఆయన చెప్పారు. దేశంలో వస్త్ర పరిశ్రమకు తమిళనాడు రాష్ట్రం విశేషంగా ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. గురువారం ఆర్టిసి క్రాస్ రోడ్డులో నూతనంగా ఆధునీకరించిన కోఆప్టెక్స్ ఫోరూమ్‌ను తమిళనాడు రాష్ట్ర మంత్రి ఆర్.గాంధీతో కలిసి ప్రారంభించి ప్రసంగించారు. ప్రతి ఒక్కరు చేనేత వస్త్రాలు వారంలోఒకరోజు ఉపయోగించి సంస్థను అభివృద్ధిపథంలో ముందుకు తీసుకెళ్ళడానికి సహకరించాలని కోరారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేనేతరంగాన్ని తమ ప్రభుత్వం అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉందన్నారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, కోఆప్టెక్స్ మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ జాకబ్, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ చేనేత, జౌళి శాఖ కార్యదర్శి వి.అమృతవల్లి, డైరెక్టర్ మాగేశ్వరి రవికుమార్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చేనేత, జౌళి శాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ కుమార్, స్టోర్ ఇంచార్జ్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 30న "రైజింగ్ తెలంగాణ సిఆర్ఎస్ అవార్డులు

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ్మా తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 20,ప్రభాతవార్త:

విద్య, వైద్యం, వ్యాపారం, స్త్రీ శక్తి రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారందరికీ రైజింగ్ తెలంగాణ సిఎస్ఆర్ అవార్డ్స్ ను ఇచ్చి సత్కరించడం ఎంతో విశేషమని ఇప్పటికే నాలుగు పర్యాయాలు వైద్యరత్న అవార్డులను అందించడం ప్రశంశనీయమని తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కొనియాడారు. ఈమేరకు గురువారం జూబ్లీ హిల్స్ లోని కార్యాలయంలో -2025 సంవత్సరానికి రైజింగ్ తెలంగాణ అవార్డ్స్ గోడపత్రికను ఆవిష్కరించారు, ఈ సందర్భంగా అయన

పోస్టు మెట్రిక్ హాస్టల్ ఉద్యోగులకు
కన్వెన్షన్ జీవో వర్తించేలా చూడాలి

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : బీసీ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పోస్టు మెట్రిక్ హాస్టల్‌లో పనిచేస్తున్న తమకు కన్వెన్షన్ జీవో వర్తించేలా చేసి జీతాలను ఇప్పించాలని బాధితులు జి.శ్రీకాంత్, ఈ.కృష్ణ, బిక్షపతి, లక్ష్మీ, కళ్యాణీ, యశోద, జ్యోతి, ఎం.జ్యోతి కోరారు. సిద్దిపేట పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు.బీసీ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో ఔట్ సోర్సింగ్ విధానంలో పోస్టు వెల్ఫేర్ హాస్టల్‌లో 49 మంది వర్కర్స్ పని చేయగా 28 మందికి మాత్రమే కంటి న్యూషన్ జీవో ఇచ్చి మిగిలిన 21 మంది ఉద్యోగులకి కంటిన్యూషన్ జీవో వర్తించేలా సంబంధిత బీసీ వెల్ఫేర్ మినిస్టర్, అధికారులు సమస్యపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి సమస్య పరిష్కరించి ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని జెఎసి సిద్దిపేట జిల్లాశాఖ నాయకులు డిమాండ్ చేశారు.

బిఆర్ఎస్ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన మాదాసు

గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త): గజ్వేల్ మండలం కోమటి బండ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త ఉబ్బని ప్రభాకర్ తండ్రి ఉబ్బని నర్సయ్య మృతిచెందగా విషయం తెలుసుకున్న గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ గురువారం బాధిత కుటుంబాన్ని పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్‌గౌడ్‌తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటికి పెద్దదిక్కు కోల్పోవ డంతో వారికి ధైర్యం చెప్పడంతోపాటు ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఆయన వెంట బిఆర్ఎస్ మండల మాజీ వైస్ ఎంపిపి కృష్ణగౌడ్, ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ శేఖర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు భాస్కర్, దుర్గారెడ్డి తదితరులు వున్నారు.

మండల సమైక్య కార్యాలయంలో శిక్షణ

వెల్దుర్తి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: మండలకేంద్రంలోని మండల సమైక్య కార్యాలయంలో గురువారం వివోఏలు, గ్రామ సంఘం ఆఫీస్ బేరర్‌లు, గ్రామ సంఘం సబ్ కమిటీ మెంబర్లకు ఆరోగ్యం, పోషణ, పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, జెండర్ అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రతి స్వయం సహాయక సంఘం ద్వితీయ సమావేశాలు నిర్వ హించుకొని ఆరోగ్యమే మహాభాగ్యం, ఆహారంతో ఆరోగ్యం, పోషకాలు నష్ట పోకుండా వంట చేసే పద్ధతులు, పిల్లలు పోషణ, రక్తహీనత,1000 రోజుల ప్రాముఖ్యత, పిల్లల పోషణకు పాటించే పద్ధతులు, చేతుల పరిశుభ్రత, సమతుల్య ఆహారం, చెత్త నివారణ, పర్యావరణ పారిశుద్ధ్యం మొదలగు అంశాలపై అంశాలపై చర్చించుకోవాలని చెప్పడం జరిగింది. అలాగే శిక్షణ ఇవ్వడం జరిగింది. స్వయం సహాయక సంఘాలు ప్రతి నెల ద్వితీయ సమావేశాలు నిర్వహించుకొని పై అంశాలపై అవగాహన కల్పించాలని శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు నవనీత, కార్యదర్శి ప్రమీల, కోశాధికారి శ్యామల, ఏపీఎం శంకరయ్య, సీసీలు, వైద్య సిబ్బంది కృష్ణవేణి, లలిత, అంగన్వాడి సూపర్‌వైజర్ వరలక్ష్మీ, అంగన్వాడీ టీచర్లు, వివోఏలు, గ్రామ సంఘం ఆఫీస్ బేరర్‌లు, సబ్ కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి 1.08 కోటి రుద్రాక్షలతో మహాశివలింగం

సంగారెడ్డి మున్సిపాలిటీ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : ఈనెల 26వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా 1.08 కోటి రుద్రాక్షలతో మహా శివలింగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీజ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వరశర్మ సిద్ధాంతి తెలిపారు. సంగారెడ్డిమండలం ఫసల్వాది లోని ఆశ్రమంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శివ లింగం 18.50 అడుగుల ఉంటుందని పేర్కొన్నారు 23వ తేదీన ఫసల్వాది లోని ఆశ్రమంలో రుద్రాక్షలతో తయారుచేసిన శివలింగాన్ని ఆవిష్కరిస్తామని చెప్పారు. శివలింగానికి భక్తులు అభిషేకంచేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొ న్నారు. భక్తులు అధిక సంఖ్యలో మహాశివరాత్రికి పాల్గొనాలని కోరారు. సమావేశంలో విద్యాపీఠం సభ్యులు తోపాజి అనంత కిషన్, ప్రశాంత్ కుమార్ దారం సంజయ్ కుమార్, కృష్ణ మూర్తి, రాము, విట్టల్ దాస్, పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

హత్నూర ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: హత్నూర మండల పరిధిలోని నాగు దేవ్ పల్లి గ్రామానికి చెందిన సీఎం సహాయనిధి లబ్దిదారులు కుమ్మరి ఆంజనేయులు రూ.39000, జోగమొల్ల సాయిలు రూ.9500 రూపాయలు గల చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే సూచనల మేరకు గురువారం అందజేసినట్లు హత్నూర మండల టిఆర్ఎస్ పార్టీ నాయకులు దూది పోచయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బాయికాడి సుధాకర్,పార్టీ అధ్యక్షులు దూడి పోచయ్య, ఉప సర్పంచ్ దౌలపురం కృష్ణ,తిరుపతి సుధాకర్,దూడి ఆంజనేయులు,నిరుడు పోచయ్య, కుమ్మరి పోచెట్టి తదితరులు పాల్గొన్నారు.

సిరిపురం గ్రామంలో.... సిరిపురం గ్రామానికి చెందిన పూల బిక్షపతి కి సీఎంఆర్ఎఫ్ 15000 చెక్కును అందజేసినట్లు మచ్చ నరేందర్ తెలిపారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి కమ్మరి సత్యనారాయణ బుచ్చయ్య పండరి నర్సిలు మున్నా తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న హుండీల ఆదాయం రూ.78,31,047

కొమురవెల్లి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి 19 రోజుల హుండీల ఆదాయాన్ని గురువారం ఆలయ ఆవరణలో లెక్కిం చారు. 19రోజుల హుండీల ఆదాయంలో భాగంగా రూ.78,31,047 నగదు, 82 గ్రాముల మిశ్రమ బంగారం,5 కిలలో మిశ్రమ వెండి, 130 విదేశీ కరెన్సీ నోట్లు, 13 క్వింటాళ్ల బియ్యం లభించినట్లు ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, ధర్మకర్తలు రవికుమార్, కొప్పరపు జయప్రకాష్‌రెడ్డి, కాయిత మోహన్‌రెడ్డి, చిగిరి కొమురయ్య, పల్గాది అంజిరెడ్డి, మామిడాల లక్ష్మీ, శ్రీరాములు, సురేందర్, అర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను అవమానించిన ఎఇవోపై చర్యలు తీసుకోవాలి

హత్నూర ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : రైతులను అవమానపరిచే విధంగా వ్యవహరించిన ఏఈఓ మహేందర్‌పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కాసాల రైతులు డిమాండ్ చేస్తున్నారు.హత్నూర మండలంకాసాల దౌల్తాబాద్ (క్లస్టర్) పరిధిలో గల రైతు వేదిక కార్యాలయానికి గురువారం వెళ్లి రైతుబంధు డబ్బులు రాలేదని అడుగగా పెట్రోల్ పోసుకొని లేదా పురుగుల మందు తాగి చనిపోతేనే వస్తుందని వ్యవసాయ విస్తీర్ణఅధికారి మహేందర్ బాధ్యత లేకుండా అవమానించే విధంగా వ్యవహరించాడని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రైతులు పొలంలో పురుగుల మందు డబ్బాలు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఏఈఓ మహేందర్ ను వ్యతిరేకిస్తూ నినాదాలు ఇచ్చారు.రైతుబంధు డబ్బులు రాలేదని అడగడం తప్పా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.ఉన్నతాధికారులు వెంటనే ఏఈఓ మహేందర్ పై చర్యలు తీసుకోవాలని రైతులు శ్రీనివాస్ గౌడ్, ప్రభుకృష్ణ, ఎండీ. అఖిల్, మల్లేశం, మహేందర్, కృష్ణ డిమాండ్ చేశారు. ఈ విషయమై ఏఈఓ మహేందర్ మాట్లాడారు. రైతుబంధు గురించి అడగగా రాలేదని, రావడానికి సమయం పడుతుందని మాత్రమే చెప్పానని అన్నారు. ఎవరిని అవమానపరచలేదని బదులిచ్చారు.

బిజెపి ఎన్నికల ప్రచారం

హత్నూర, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో హత్నూర మండలోని వివిధ విద్య సంస్థల్లో ఉపాధ్యాయ మరియు పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల పక్షాన గురువారం ఎన్నికల ప్రచారంను బీజేపీ మండల అధ్యక్షుడు నాగప్రభు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నర్సాపూర్ ఎన్నికల ఇంచార్జీ నూకల పద్మరెడ్డి , బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీరా రెడ్డి,బీజేపీ మండల నాయకులు ప్రభాకర్ రాకేష్ మల్లేష్ సాయిరాం శేఖర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పరిధి కండ్లకోయలో అక్రమ షెడ్డు నిర్మాణం

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

మేడ్చల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : మున్సిపల్ పాలకవర్గ సభ్యుల పదవీ కాలం గడువు ముగియడంతో అధికారులకు అదుపు లేకుండా మారిందనే విమర్శలు వెలువడుతున్నాయి. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో అక్రమ కట్టడాలు వెలుస్తున్న అధికారులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేమిటని పలువురుప్రశ్నిస్తున్నారు.నగరానికి చేరువలోఉన్న గుండ్లపోచంపల్లి కట్టడాలు రోజురోజుకు పెరుగుతున్నాయి.కాగా అందులో నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలువెలుస్తున్న అధికారులుపట్టించుకోవడంలేదనె ఆరోపనులు ఉన్నాయి. పాలకవర్గంఉన్న సమయంలో పర్యవేక్షణ ఉండటంతో అన ుమతులు తీసుకుని కట్టడాలు చేపట్టేవారని, ప్రస్తుతం వారు లేకపోవడంతో అనుమతులు లేకుండా అదికారుల అండదండలతో అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. మున్సిపాలిటిలోని కండ్లకోయ పరిధిలో అనుమతులు లేకుండా షెడ్డునిర్మాణం చేపడుతున్నా అటువైపు అధికారులు చూడక

గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధి కండ్లకోయలో అక్రమంగా వెలుస్తున్న షెడ్డు

పోవడంలో ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అంతే కాకుండా అక్రమ నిర్మాణాలు ఎలా చేసుకోవాలో కొంతమంది మున్సిపల్ ఉద్యోగులే సలహాలు ఇస్తున్నారనే ఆరోపనలు ఉన్నాయి. అక్రమ కట్టడాలతో ప్రభుత్వ ఖజానాకు గండికొట్టడం తగదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పర్యవేక్షించాని, అక్రమ కట్టడాలను నియంత్రించాలని డిమాండ్ చేస్తున్నారు.

మెను ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలి

ఆదివాసి కమిటీ చైర్మన్ ఇస్లావత్ లింగ్య నాయక్

ఆమనగల్లు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త: ఆశ్రమ పాఠశాల, వసతి గృహాలలో విద్యార్థులకు ప్రభుత్వం మెనూ ప్రకారం ఆహార మందించాలని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఆదివాసి కమిటీ చైర్మన్ ఇస్లావత్ లింగ్య నాయక్ తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం, స్వచ్ఛమైన త్రాగునీటి తిని అందించాలని సూచించారు. ఆమనగల్లు పట్టణ కేంద్రంలోనీ గిరిజన ఆశ్రమ పాఠశాల, కస్తూరిబా గాంధీ ఉన్నత పాఠశాలలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆదివాసి ఉమ్మడి జిల్లా కమిటీ చైర్మన్ ఇస్లావత్ లింగ్య నాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు కృష్ణనాయక్ తో కలిసి సందర్శించారు. ఈ మేరకు వంట గది, తరగతి గదులు, టాయిలెట్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పాఠశాలలలో భద్రత కల్పించవలసిన ఆవశ్యకత ఉందన్నారు.

కాస్మోటిక్ ఛార్జీల ప్రకారం నాణ్యమైన వస్తువులను అందించడంతో పాటు రుచికరమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హలీం, భాస్కర్, నాయక్, శివ నాయక్,శీను, శ్రీధర్

ఆమనగల్లులో పాఠశాల ను సందర్శించిన లింగ్య నాయక్

నాయక్, రాజేందర్,హరి,రమేష్ నాయక్,హరి లాల్, తదితరులు ఉన్నారు.

పైవేట్ ఆస్పత్రిలో వ్యక్తి మృతి

ఆందోళనకు దిగిన మృతుడి బంధువులు

సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : సంగారెడ్డి పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో వ్యక్తి చనిపోవడంతో అతడి బంధువులు ఆందోళన చేపట ్టడంతో గురువారం కొంత సేపు ఉద్రత పరిస్థితులు ఏర్పడ్డాయి.విషయం తెలుసుకున్న సంగారెడ్డి డి.ఎస్.పి, సీఐలు పోలీసు బందోబస్తుతో చేరుకొని పరిస్థితులను అదుపుచేశారు మృతుని బంధువుల కథనం ప్రకారం కొండాపూర్ మండలం గారకుర్తి గ్రామానికి చెందిన వెల్దురి శ్రీనివాస్ తరచూ గురక సమస్య వస్తుండంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు సంగారెడ్డిలోని పద్మావతి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి బుధవారం మధ్యాహ్నం తీసుకు వచ్చారు. ఆయనను పరీక్షించిన సంగారెడ్డిలోని పద్మావతి ఆసుపత్రి వైద్యులు ముక్కులో బోను పెరిగింది ఆపరేషన్ చేస్తే తగ్గుతుందని తెలిపారని అన్నారు. బుధవారం ముక్కులో బోనుకు ఆపరేషన్ చేశారు. అయితే రాత్రి 2.00 గంటలకు శ్రీనివాస్ (42) చనిపోయారని కుటుంబ సభ్యులకు వైద్యులు తెలి పారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ఎలా చనిపోతాడని .కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం వ్యక్తం చేస్తూ ఆసుపత్రి ముందు ఆందోళన చేశారు. మృతుని బంధువు లకు ఆసుపత్రి యాజమాన్యాము సిబ్బందికి మధ్య తీవ్ర వాగ్వివాదం చేసుకోవడంతో పాటు తోపులాట జరిగింది.విషయం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. మృతునికి ఇద్దరు కూతుళ్లు ఒక కుమారుడు ఉన్నారు. పద్మావతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన శ్రీనివాస్ మృతిపై అతని సోదరుడు నాగేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సంగారెడ్డి పట్టణ సిఐ రమేష్ తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

కొమురవెల్లి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పదోతరగతి విద్యార్థులకు బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బి.రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పరీక్ష సామాగ్రి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ ఫలి తాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాలన్నారు. టెన్త్‌లో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.11,116, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.5116 అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు గజ్జె వెంకటేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భాదిత కుటుంబానికి అండగా ఉంటాం : ఎస్పీ

సంగారెడ్డి మున్సిపాలిటీ ఫిబ్రవరి 20, ప్రభాతవార్త: మునిపల్లి మండలం, అంతారం గ్రామానికి చెందిన మృతురాలు ఆలియా బేగం కుటుంబాన్ని గురువారం జిల్లా ఎస్పీ పరామర్శించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మునిపల్లి మండలం, అంతారం గ్రామంలో మహ్మద్ ఇస్మాయిల్ మరియు కొల్లూరి వీరా రెడ్డి, విజయ్ రెడ్డిల మధ్య జరిగిన గొడవలో విడిపించడానికి వెళ్ళిన ఇస్మాయిల్ కూతురు ఆలియా బేగం,ప్రమాదవశాత్తు గాయపడి, చికిత్స పొందుతూ మరణించడం జరిగిందిని . ఆమె అకాల మరణం వారి కుటుం బానికి తీరని లోటు అని,సంతాపం వ్యక్తం చేశారు.ఎలాంటి సమస్యలున్న నేరుగా నాతో మాట్లాడొచ్చు అని జిల్లా ఎస్పీ సూచించారు. ఇందుకు కారణమైన నిందితులను ఇప్పటికే అరెస్ట్‌చేసి జుడీషియల్ రిమాండ్ కు పంపించడం జరిగిందని అన్నారు. మృతురాలు ఆలియా బేగంపైన వారికి ఎలాంటి కక్షలేదని, కేవలం ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగా భావించాలని ఎస్పీ అన్నారు.ఈ విషయమై ఎవరైనా సామాజిక మాధ్యమాలలో రెచ్చగొట్టే విధంగా పోస్ట్ లు పెట్టిన, వ్యాక్యలు చేసిన అట్టి వ్యక్తులపై చట్ట రిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ఎస్పీ వెంబడి సంగారెడ్డి డియస్పీ సత్యయ్య గౌడ్, కొండాపూర్ ఇన్స్పెక్టర్ డి. వెంకటేష్, మునిపల్లి ఎస్పీ రాజేష్ నాయక్ సిబ్బంది ఉన్నారు.

పైవేటు పాఠశాల ముందు బిజెపి నాయకుల ధర్నా

ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని అఖిల కుటుంబానికి న్యాయం చేయాలి

మేడ్చల్, ఫిబ్రవరి20. ప్రభాతవార్త : ఫీజు వేధింపులతో ఆత్మహత్యకు పాల్పడిన అఖిల కుటుంబానికి తగిన న్యాయం చేయాలిన కోరుతూ మేడ్చల్‌లోని పాఠశాల ముందు బీజేపీ మున్సిపల్ అధ్యక్షురాలు శైలజా హరినాథ్ ఆధ్వర్యంలో నాయకులు ధర్నా నిర్వహించారు. పది రోజుల క్రితం మేడ్చల్ పట్టణంలోని పాఠశాలకు చెందిన విద్యార్థిని అఖిల ఫీజుల వేధింపుల తాళలేక ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. కాగా పాఠశాల వేధింపులతోనె మృతి చెందిందని ఆరోపిస్తూ ఆమె కుటుంబ సభ్యులు పాఠశాల ముందు ఆందోళన వ్యక్తం చేయగా విద్యార్థి సంఘాలు కూడ వారికి మద్దతుగా నిలిచాయి. ఆమె మృతికి కారణమైన పాఠశాల యాజవ న్యాం విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని బిజెపి నాయకులు డిమాండ్ కూడచేశారు.ఈక్రమంలోపాఠశాల యాజమాన్యం మృతురాలి తల్లిదండ్రులను గురువారం పాఠశాలకు పిలిపించి పట్టించుకోక స్పందించని కారణంగా మేడ్చల్ బీజేపీ నాయకులు జోక్యం చేసుకుని వారికి న్యాయం చేయాలని కోరారు. మద్యాహ్నం వరకు ఎవరూ కూడ రాకపోవడంతో పాఠశాలముందు టెంట్ వేసి విద్యార్థిని తల్లితండ్రులతో పాటు బీజేపీనాయకులు బైఠాయించారు.

ఈ సందర్భంగా బీజేపీ మున్సిపల్ అధ్యక్షురాలు మాట్లాడుతూ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఆత్మహత్య చేసుకుని మృతి చెందితే కనీసం మానవతా దృక్పదం లేకుండా వారి తల్లి దండ్రులను అవమానించే విదంగా పాఠశాలకు పిలిపించి పట్టించుకోక పోవోవడం దారణమని అన్నారు. వారికి న్యాయం చేయాల్సింది పోయి వారిని పాఠశాలలో వారి వేదనను సైతం లెక్కచేయడం లేదన్నారు.

వెంటనే యాజమాన్యం స్పందించి వారిని తగిన న్యాయం చేయాలని లేని ఎడల ఉద్యమంచేయక తప్పదని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ప్రేమ్‌దాస్, వంశీరెడ్డి, వంశీ విజయ్, కృష్ణప్రియరెడ్డి,ఎస్పారెడ్డి, పాల్గొన్నారు.

సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో
అన్ని వర్గాల ప్రజలకు న్యాయం

సిద్దిపేట అర్బన్,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త : కాంగ్రెస్ ప్రభుత్వ హయాం లో సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్నివర్గాలకు న్యాయం జరుగుతుం దని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రైవేటు కళాశాలలో పర్యటించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 55 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడం జరిగిందన్నారు. బిజెపిని గెలిపించడానికే బిఆర్ఎస్ చీకటి ఒప్పందం చేసుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదన్నారు. బిజెపి, బిఆర్ఎస్ నాయకులు ఎన్ని మాయ మాటలు చెప్పినా ప్రజలు నమ్మె పరిస్థితుల్లో లేరన్నారు. కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించి తీరుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 22న సిద్దిపేటలో సభ నిర్వహించడం జరుగు తుందని సభకు మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరవుతారని తెలిపారు.సమావేశంలో నాయకులు పూజల గోపికృష్ణ, యాదగిరి, కలీం, గాయజుద్దీన్, రాజిరెడ్డి, రాజేష్‌ఖన్నా, సాయిప్రతాప్, స్వామి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన న్యాయమూర్తి

కొండపాక, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం కొండపాకశివారులోని వృద్ధాశ్రమం అనంద నిలయాన్ని సిద్దిపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి స్వాతిరెడ్డి సందర్శించారు. అదే ప్రంగణంలో ఉన్న బాల సదనం సందర్శించి ఆమె మాట్లాడారు. బాలలకు చట్టం కల్పించిన హక్కు లను వాటి పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. బాలురకు పలు సూచనలు సలహాలను ఇచ్చారు. కార్యక్రమాల్లో వృద్ధాశ్ర మం డైరెక్టర్‌లు వైకుంఠం, గట్టు రవి,న్యాయవాది, లీగలైయిడ్ కౌన్సిలర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాయవరం పాఠశాలను సందర్శించిన ఎంఇవో

కొండపాక, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : ఉపాధ్యాయులు కొంచం కష్ట పడితే విద్యార్థులను మెరికల్ల తయారు చేయవచ్చునని ఎంఈఒ బచ్చలి సత్తయ్య అన్నారు. గురువారం రాయవరం ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తయారు చేసిన బోధన, అభ్యాసన సామాగ్రిని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల వర్క్ బుక్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు చక్కగా చదువుతున్నం దుకు సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు కొంచం కష్టపడితే విద్యార్థులో చాలామార్పు తీసుకురావచ్చునని నిరూపించిన ఉపాధ్యాయు లను ఆయన అభినందించారు. విద్యార్థులకు చాలా రుచికరమైన భోజనం తయారు చేసి పెడుతున్న మధ్యాహ్న బోజన కార్మికులను, ఉపాధ్యాయుల కృషిని ఆయన ప్రశంసించారు.

ఇసుక అక్రమ నిల్వపై చర్యలు తీసుకోవాలి

కొండపాక, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : కుకునూరుపల్లి మండల పరిధి మంగోల్ గ్రామ మదిర కాశనగర్ ప్రక్కనున్న కెసిఆర్ పేరుగల ఇటుక బట్టీ లలో యాజమాని ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను(డంపు) నిల ్వఉంచారు. ప్రభుత్వం అక్రమంగా ఇసుకను, మట్టిని, రేషన్ బియ్యాన్ని ప్రభుత్వ అనుమతులు లేకుండా నిల్వ ఉంచరాదని పదే పదే చెపుతున్నా బట్టీల యాజమని అధికారుల మాటలను బేఖాతర్ చేస్తూ యధేచ్చగా ప్రభుత్వ అనుమతులు లేకుండా నిల్వ ఉంచారు. అంతేకాకుండా ఇటుకలు తయారు చేయడానికి ఉపయోగించే మట్టిని వివిధ గ్రామాల్లోని చెరువుల్లో నుండి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా వందల లారీల తరలించి గుట్టలు గుట్టలుగా పోసి నిల్వ చేశారు. ఇప్పటికైన ఇరిగేషన్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు కాని, టాస్క్ పోర్స్ అధికారులు కాని నిల్వ ఉంచిన ఇసుక, మట్టిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లేబర్ బోర్డు చైర్మన్‌ను వెంటనే నియమించాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : రాష్ట్రంలో ఉన్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం లేబర్ బోర్డు చైర్మన్‌ను ప్రభుత్వం వెంటనే నియమించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం కోరారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలుల కావస్తున్న నేటీకీ లేబర్ బోర్డు చైర్మన్‌ను నియమించకపోవడం సరి కాదన్నారు. లేబర్ బోర్డులో ఉన్న రూ.2 వేల కోట్లు భవన నిర్మాణ కార్మికు లకు ఏదైనా ప్రమాదం జరిగితే నిధులు కేటియించే పరిస్థితి లేదన్నారు. కార్మికులకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యత నివ్వాలన్నారు. మంత్రి జూపల్లి కృష్ణరావు కార్మికుల పక్షాన మాట్లాడడం శుభ సూచకమన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి లేబర్ బోర్డు కమిషన్ చైర్మన్‌ను నియమించేలా కార్మికుల సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని ఆయన మంత్రి జూపల్లి కృష్ణరావును కోరారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : మద్యం మత్తులో ఇరువు మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. సిద్దిపేట టూ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని నర్సాపూర్ రోడ్డులోగల గ్యాదరి మైసమ్మ ఆలయం సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెంది ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎసిపి మధు, టూ టౌన్ సీఐ ఉపేందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ సహాయం తో ఆధారాలు సేకరించి మాట్లాడారు. తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లికి చెందిన బోదాస

పనులు పూర్తి...ప్రారంభించేదెన్నడో



ప్రారంభోత్సవానికి ఎదురుచూస్తున్న దుకాణసముదాయం

ఆమనగల్లు, ఫిబ్రవరి18, ప్రభాతవార్త:

ఆమనగల్లు పట్టణంలోని మార్కెట్‌యార్డు దుకాణ సముదాయం పనులు పూర్తి చేసుకున్నా ప్రారంభోత్సవానికిమాత్రం నోచుకోవడంలేదు. 84లక్షల నిధులతో 8దుకాణాలను నిర్మించారు. హైదరాబాద్-శ్రీశైలం రహదారి ఫేసింగ్‌లో4, లోపలిభాగం ఫేసింగ్‌లో 4దుకాణాలు నిర్మించారు. నిర్మించిన దుకాణాలకు షట్టర్లు, కలర్లు, కరెంటుతో సహా అన్ని పనులను పూర్తి చేశారు.

ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలి



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న నిపుణులు

ఆమనగల్లు, ఫిబ్రవరి20, ప్రభాతవార్త:

శరీరావయవాల ఆరోగ్యసంరక్షణపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని వైద్యులు దొంతు శ్రీకాంత్, దొంతు సుజల, కంటివైద్య నిపుణులు మెండేటి చంద్రశేఖర్ అన్నారు. ఆరోగ్యవంతమైన కళ్లు ఉంటేనే అది సాధ్యమని, విద్యార్థిదశ నుండే నేత్ర ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమనగల్లు పట్టణంలోని కెజివిబి బస్టాండ్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు కంటిపరీక్షలు నిర్వహించారు. కంటి ఆరోగ్యంపట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు, దృష్టిలోపంపై సలహాలు, సూచనలు అందించారు. నేత్ర వ్యాయామలోపం, అధిక సెల్‌ఫోన్ వినియోగంవల్ల దృష్టిలోపాలకు గురికావలసి వస్తుందని డాక్టర్ దొంతు శ్రీకాంత్ అన్నారు. చిన్నతనం నుండే నేత్ర ఆరోగ్యపరిరక్షణకు పాటుపడితే సుదీర్ఘకాలం ప్రపంచాన్ని చూడవచ్చని సూచించారు. ఈమేరకు విద్యార్థులందరికీ కంటిపరీక్షలుచేసి లోపాలు ఉన్న విద్యార్థులను రంగారెడ్డిజిల్లా షాద్‌నగర్ తీసుకువెళ్ళి అద్దాలు ఇవ్వడం జరిగుతుందని డాక్టర్లు దొంతు శ్రీకాంత్, దొంతు సుజల తెలిపారు. కార్యక్రమంలో అనిత, రహీం తదితరులు ఉన్నారు.

మండలానికి మహిళానాయకత్వం కావాలి

నవాబుపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

మండలంలో మహిళలు రాజకీయాల్లోకి వస్తున్నప్పటికీ రిజర్వేషన్ల స్థానాల్లో పదవులు నిర్వహించి పదవీకాలం ముగియడంతోనే వారు రాజకీయాలకు దూరమవుతున్నారు. జడ్పిటిసి, ఎంపిపిలుగా, సర్పంచ్‌లుగా, ఎంపిటిసిలుగా, మహిళారిజర్వేషన్లలో ఎన్నికవుతున్నారు. పదవీకాలం ముగిశాక వారు రాజకీయాలకు దూరమవుతున్నారు. దీంతో బలమైనమహిళల నాయకత్వానికి మండల మహిళలు నోచుకోవడంలేదు. స్థానికసంస్థల్లో మొదటిసారి మండలంలో ఎంపిపిగా మండలపరిధిలోని కుర్రాంమం అత్తాపూర్ గ్రామానికిచెందిన జి.సువర్ణదేవి ఎన్నికయ్యారు. ఆమెభర్త జి.నాగేందర్‌గౌడ్ మొదటి ఎంపిపిగా పదవి నిర్వహించారు. బిసిమహిళకు ఎంపిపి స్థానం రిజర్వుకావడంతో స్థానికేతర గ్రామం ఎక్‌మామిడి ఎంపిటిసి స్థానం నుండి పోటీచేసిగెలుపొందారు. ఎంపిపిపదవిని అలంకరించారు. కొన్నాళ్ళు పదవిలో కొనసాగారు. వికారాబాద్‌జిల్లా గ్రంథాలయ సంస్థ పదవిని భర్త నాగేందర్‌గౌడ్‌కు ఇవ్వడం కోసం ఇక్కడ ఎంపిపి పదవిని త్యాగం చేయాల్సి వచ్చింది. దీంతో వైస్‌ప్రెసిడెంట్‌గా ఉన్న పులుమామిడి గ్రామానికి చెందిన జయదాబేగంకు ఎంపిపి పదవి వరించింది. మహిళస్థానంలో మరో మహిళ రావడంతో మహిళానేత స్థానం పదిలంగా ఉండిపోయింది. ఆమెకూడా పదవీకాలంతోనే రాజకీయాలను విరమించుకున్నారు. మండలస్థాయి రాజకీయాల్లో రెండుపదవులు మహిళలకు రిజర్వు అయ్యాయి. దీంతో మరో ఇద్దరుమహిళలు నేటి,నాటి చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య సతీ మణి కాలె జయమ్మ, ఆయన స్వంతకోడలు కాలె భవాని ఎంపిపిగా ఎన్నికైనా పదవీకాలంలోనే రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. సర్పంచ్‌లుగా, ఎంపిటిసిలుగా మహిళలు ఎన్నికవుతున్నప్పటికి పూర్తిస్థాయి రాజకీయాల్లో కొనసాగటంలేదు. దీంతో మహిళానేతల కొరత ఎప్పటికప్పుడు ఏర్పడుతూనే ఉంది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి మండలాధ్యక్షురాలిగా మండలపరిధిలోని మీనపల్లికలాన్‌కు చెందిన జ్యోతి కొన్నాళ్ళు కొనసాగినప్పటికీ ఆమె దళితురాలు కావడంతో సామాజిక, వ్యక్తిగత కారణాలతో ఆమెరాజకీయాల్లో కొనసాగలేకపోయారు. ఈవిధంగా మహిళలు శాశ్వతంగా రాజకీయాల్లో రాణించలేకపోతున్నారు. దీంతో మహిళల ప్రాతినిధ్యం మండలరాజకీయాల్లో దాదాపుగా లేదనిచెప్పవచ్చు. అన్నిరంగాల్లో రాణిస్తున్నా రాజకీయాల్లో వెనుకంజలో ఉన్నారు. ఓటమి ఎరుగని నాయకురాలు మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, తదితరమహిళానేతలను ఆదర్శంగాతీసుకుంటే రాజకీయాల్లో రాణించే అవకాశాలుంటాయని విశ్లేషకులు అభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారు.

బిసిసేన నూతనకమిటీ ఎన్నిక



అసెంబ్లీ అధ్యక్షుడిని ప్రకటిస్తున్న బిసిసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ

షాద్‌నగర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

బిసిసేన షాద్‌నగర్ అసెంబ్లీ అధ్యక్షుడిగా చంద్రశేఖరప్పను బిసిసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ ఎంపికచేశారు. పట్టణంలోని దేవిగ్రాండ్ హోటల్‌లో జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి బర్క కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిల అభివృద్ధి, హక్కులసాధన, రాజకీయప్రాధాన్యతపెంపు తదితర అంశాలపై విశ్లేషణాత్మకంగా చర్చించారు. బిసిల ఐక్యతకు, సామాజిక న్యాయసాధనకు బిసిసేన అహర్నిశలు కృషిచేయాలని పిలుపునిచ్చారు.

ఈసమావేశంలో బిసిసేన నేతలు అందె బాబయ్య, సత్యం, లక్ష్మణ్, ఆర్ఎంపిసంఘం అధ్యక్షుడు చందులాల్, ఎస్.శంక రయ్య, జగదీష్‌గౌడ్, చందు, సత్యం, హరీష్‌కుమార్, నరేష్, రమేష్, సాయికుమార్, కాట్న రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

41వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

శంకర్‌పల్లి మండలంలోని కొండకల్ తండావాసులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారంతో 41వ రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా దీక్షలో పలువురు గిరిజనులు కూర్చున్నారు. తమభూములను అక్రమంగా కబ్జాచేసి తమపైన కేసులుపెట్టి వేధింపులకు పాల్పడుతున్నారని, 80ఎకరాలభూమిని కబ్జాచేస్తే పాలకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గిరిజనులకు న్యాయంచేసేవరకు దీక్షలు కొనసాగుతాయని హెచ్చరించారు.

గుట్టుచప్పుడుకాకుండా చెరువునీళ్లు తరలింపు!

తక్షణ చర్యలు తీసుకోవాలంటూ రైతుల ఫిర్యాదు

కొడంగల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

కొడంగల్ మండలకేంద్రంలోని పెద్దచెర్వులోంచి నీళ్ళు అక్రమంగా తీసుకెళ్తున్నా, అడ్డుకోవాల్సిన అధికారులు అలసత్వం వహిస్తున్నారు. ఇదే విషయమై రైతులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. చెర్వులోని నీటిని కాపాడాల్సిన అధికారులే తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తే ఎవరిని అడగాలో తెలియడంలేదని పెద్దచెర్వు ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వివరాల్లోకి వెళితే, కొడంగల్ పెద్దచెర్వు కింద మొత్తం 559ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాకాలంలో చెర్వు నిండడంతో ఆయకట్టు సాగు చేసుకునేందుకు చెర్వులో ఉన్న నీటి సామర్థ్యం ఆధారంగా 165ఎకరాలు సాగు చేసుకునేందుకు నీటిపారరుదలశాఖ, రెవెన్యూశాఖ అధికారులు తీర్మానంచేసి తైబందు నిర్వహించారు. కాగా అధికారులు చెప్పినవిధంగా రైతులు 165 ఎకరాలవరకు సాగుచేసుకున్నారు. ఈసారి ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో చెర్వులో నీరు వేగంగా ఇంకిపోతుంది.ఓ వైపు చెర్వులో నీరు వేగంగా ఇంకిపోతుంటే మరోవైపు చెర్వుకుపై భాగాన ఉన్న పాతకొడంగల్ తండాకుచెందిన పలువురు రైతులు వెనుకభాగం నుంచి సుమారు 10 మోటార్లతో తండాకు అక్రమంగా చెర్వునీటిని తరలిస్తూ వరిపంటలు సాగుచేసుకుంటున్నారు. వాస్తవానికి పాతకొడంగల్ తండావాసులకు పెద్దచెరువు నీటిని తరలించేందుకు ఎలాంటి హక్కులు లేవు.

కొడంగల్ పెద్ద చెరువు పైభాగాన మోటర్లతో నీటిని తరలిస్తున్న దృశ్యం

ఈవిధంగా నీటిని తరలిస్తుంటే ఓవైపు ఎండలు, మరోవైపు అక్రమంగా నీటితరలింపుతో చెరువుకింద సాగుచేసిన రైతులు పంటలు పండుతాయో, లేదోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై గత 20రోజులుగా నీటిపారుదల, రెవెన్యూశాఖల అధికారులకు, కడా ప్రత్యేకాధికారిదృష్టికి తీసుకువెళ్ళినా ఎలాంటి ఫలితం దక్కలేదని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. అధికారులు పరిష్కరించాల్సిన సమస్య వల్ల కొడంగల్ పెద్దచెర్వు ఆయకట్టు రైతులు పాతకొడంగల్ తండాకుచెందిన రైతులమధ్య పలుమార్లు ఘర్షణలు చోటుచేసుకున్నాయి.ఇందులో ఎవరికి ఏప్రమాదంజరిగినా అధికారులే పూర్తిబాధ్యత వహించాల్సి ఉంటుందని రైతులు పేర్కొన్నారు. ఈవిషయమై నీటిపారుదల శాఖ డిఈ కిరణ్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్ళగా చెరువుకు పైభాగంలో ఉన్న మోటర్ల వల్ల నీటిని తరలిస్తున్న విషయం తమదృష్టికి వచ్చిందని, రెండురోజుల్లో చెరువుదగ్గరకు వెళ్ళి మోటర్లను తొలగించి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రమాభాయి అంబేద్కర్ నూతన కమిటీ ఏర్పాటు

నూతన కమిటీ సభ్యులు

కొడంగల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

కొడంగల్ మున్సిపల్ కేంద్రంలోని 12వ వార్డులో కొడంగల్ తాలూకా ప్రజా అంబేద్కర్ సంఘం అధ్యక్షులు యు.రమేష్‌బాబు అద్వర్యంలో గురువారం రమాభాయి అంబేద్కర్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి.మల్లమ్మ, ఉపాధ్యక్షురాలుగా జి.భారతి, డి.శిరీష, ఈ.కృష్ణవేణీ, ప్రధాన కార్యదర్శిగా డి.వెంటమ్మ, సహాయ కార్యదర్శిగా యు.అంజమ్మ, డి.అంజమ్మ, కోషాధికారిగా డి.సరస్వతి, యు.అమృతమ్మ, కల్చరల్ సెక్రటరీగా యు.శోభ, డి.సావిత్రిలతోపాటు సలహదారులుగా పెంటమీది ఆశమ్మ, నరసమ్మ, పద్మమ్మ, శాంతమ్మ, అంజులమ్మ, లక్ష్మీలను ఎన్నుకున్నారు.

పరమ పవిత్రం పుణ్యస్నానం..!

-మహాకుంభమేళాకు నందిగామ భక్తులు

నందిగామ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాకు రంగారెడ్డిజిల్లా నందిగామ మండలకేంద్రానికి చెందిన పలువురు పాత్రికేయప్రముఖులు బయలుదేరి వెళ్లారు.144ఏళ్లకు ఓసారివచ్చే ఈమహాకుంభమేళాలో పవిత్ర త్రివేణిసంగమంలో పుణ్యస్నానం ఆచరించి వేదబ్రాహ్మణుల మంత్రాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి పునీతులయ్యారు. మహాకుంభమేళాలో భక్తులు సార రవికుమార్ గౌడ్, ఎదిరే శ్రీహరిగౌడ్, ప్రముఖకాంట్రాక్టర్ సందీప్‌రెడ్డి, బోర్ర ఆంజనేయులు (బంటు), ఎర్రగుంట బాలరాజ్ తదితరులు ఉన్నారు.

ఫోటో రైట్ అప్: మహా కుంభమేళాలో స్నానమాచరించిన నందిగామ భక్తులు

ఆర్థికసాయం అందజేసిన మాజీ జడ్పిటిసి

-పేదింటి వివాహాలకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ 42000 ఆర్థిక సాయం

కడ్తాల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

కడ్తాల్ మండలంలోని పేదింటి వివాహాలకు జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ 42000వేల రూపాయల ఆర్థికసాయంతోపాటు మేనమామ కట్నం కింద పట్టుచీర అందించారు. కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన కానుగుల అలివేలు నాగయ్య దంపతుల కూతురు విజయలక్ష్మి వివాహానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థికసాయాన్ని ట్రస్ట్ చైర్మన్ లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథనాయక్ అందించారు. గానుగమర్ల గ్రామపంచాయతీ పరిధిలోని కానుగుబాయి తండాకుచెందిన నేనావత రాజు, అనితల కుమార్తె ఝాన్సీ వివాహానికి 210000వేల రూపాయల ఆర్థికసాయంతో పాటు మేనమామ కట్నం కింద పట్టుచీరను అందించారు. అలాగే ఝాన్సీ వివాహానికి స్థానిక నాయకులు డైరెక్టర్ సేవ్యానాయక్. రూ.25000 మాజీ ఉపసర్పంచ్ నేనావత్ శారదపాండు 50000వేల రూపాయల ఆర్థికసాయం అందించగా, మాజీవార్డుసభ్యులు నెనావత్ లక్ష్మణ్ 75000వేల రూపాయల ఆర్థికసాయం అందించారు. వారికి తోడుగా, బిఆర్ఎస్ నాయకులు శ్రీను 10000, వార్డు మెంబర్ భీమన్ 4000, శంకర్ నాయక్ 5000 రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్, గ్రామకమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు లాయక్‌అలీ, మహేష్, దాసు, కిషన్, శ్రీకాంత్, వెంకటేష్, శ్రీశైలం, కృష్ణ, రతన్, సక్రు, వినోద్, రవి, నరేష్, నాగేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

-ఎమ్మెల్యే

కంటోన్మెంట్,ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:

అనారోగ్యంతో బాధపడుతున్న పేద ప్రజలకు మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సూచించారు. కంటోన్మెంట్ 6వ వార్డు నందమూరి నగర్‌కు చెందిన సక్కుబాయి అనారోగ్యంతో బాధపడుతుంది.మెరుగైన వైద్యం కోసం సిఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.35 వేల చెక్కును గురువారం కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్‌తో కలిసి బాధితురాలికి అందజేశారు.

వెంకటాపూర్ ఎయూలో టెక్‌సే సెలరేట్‌పై సదస్సు

సెమినార్‌లో పాల్గొని మాట్లాడుతున్న వెబ్ నిపుణుడు అనుదీప్

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో టెక్‌సె సెలరేట్ సెమినార్ శుక్రవారం జరిగింది. టెక్‌సె సేలరేట్ కార్యక్రమంలో భాగంగా వెబ్ అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. వెబ్ డిజైన్, వెబ్‌డెవలప్‌మెంటుపై భవిష్యత్తు అభివృద్ధిపై విద్యార్థులకు వెబ్ నిపుణుడు అనుదీప్ మార్లాపల్లి వివరించారు. ఇంటర్నెట్‌ఆఫ్‌థింగ్స్, సెన్సార్ నెట్‌వర్క్ నుండి స్మార్ట్ పరికరాల వరకు పరస్పర సంబంధం ఉన్న సాంకేతిక పరిజ్ఞానసామర్థ్యాన్ని వివరించారు. ఆర్టిఫిషీయల్ ఇంటెలిజెన్స్, మెషిన్‌లెర్నింగ్, యంత్ర అభ్యాసం, బాషాప్రాసెసింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెబ్‌నిపుణులు రత్నాశేఖర్, అమితామిశ్రా, బాల్‌రామ్, మాదార్ బంధు, మోహబూబ్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనను విజయవంతం చేయాలి

-మండల పార్టీ అధ్యక్షులు నర్సిములుగౌడ్

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

తెలంగాణరాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శుక్రవారం పోలేపల్లి జాతర సందర్భంగా మధ్యాహ్నం 12గంటలకు రావడం జరుగుతుందని బొంరాస్‌పేట్ మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు నర్సిములుగౌడ్ తెలిపారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం 12గంటలకు పోలేపల్లి జాతర సందర్భంగా హైదరాబాద్ నుండి హెలికాప్టర్ ద్వార పోలేపల్లి చేరుకుని అక్కడ అమ్మవారి దర్శనం చేసుకోని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. అక్కడినుండి సాయంత్రం 3గంటలకు నారాయణపేట్‌జిల్లాలో జరిగే సమావేశానికి సిఎం వస్తున్నారని అయన తెలిపారు. బొంరాస్‌పేట్ మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అయన కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ రాజ్యాంగం ద్వారానే అందరికీ ఫలాలు

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బంజారా నాయకులు

కొడంగల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే అందరికి ఫలాలు అందుతున్నాయని శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ ఉత్సవకమిటీ అధ్యక్షులు శివ చౌహాన్, ప్రధాన కార్యదర్శి తాజా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గల అంబేద్కర్ విగ్రహానికి వారు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యంగం ద్వారా నేడు అన్నివర్గాల వారికి న్యాయం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో బంజారానాయకులు చందర్‌నాయక్, రాజునాయక్, సామ్యనాయక్, రతన్ నాయక్, రమేష్‌నాయక్, మాజీసర్పంచ్ రాజునాయక్ పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీపథకం వెంటనే ప్రారంభించాలి

బికెఎంయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

సమావేశంలో మాట్లాడుతున్న బికెఎంయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

షాద్‌నగర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.అంజయ్య, బుద్దుల జంగయ్యలు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు పేర్కొంటూ గ్రామాల్లో వ్యవసాయ పనులన్నీ అయిపోయి, కూలీలు ఇంటి వద్ద ఖాళీగా ఉండే పరిస్థితి ఉందని, ఎండలు కూడా విపరీతంగా ఉన్నాయని, వెంటనే ఎన్ఆర్ఈజీఎస్ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. క్యూబిక్ మీటర్ లెక్క చేసిన పనులకు ఇప్పటికీ పెండింగ్ బిల్లులు ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుందని విమర్శించారు. అందులో నుంచి పదివేల కోట్లు బకాయిలకే పోతాయని, మిగతా రూ.76 వేల కోట్లతో దేశవ్యాప్తంగా పనులు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా దాదాపు 80 లక్షలకు పైగా పేద కూలీలు ఉంటారని, వారికి ఈ బడ్జెట్ ఏ మాత్రం సరిపోదని, ఈ విషయంలో పునరాలోచించి, రెండు లక్షల అరవై మూడు వేల కోట్ల రూపాయలు కేటాయించాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కొలతలతో సంబంధం లేకుండా రోజు కూలీ రూ.700 ఇవ్వాలని, రెండు వందల రోజులు పనులు కల్పించాలని, టెంట్లు, మంచినీళ్లు, వైద్య కిట్లు, గడ్డపార, పార, రవాణా సౌకర్యం, తదితర ఏర్పాట్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

శంకర్‌యాదవ్‌చే అన్నప్రసాద కార్యక్రమం

తాండూరు టౌన్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

శ్రీశైలంలోని శివభక్తుల సేవలో తాండూరుకు చెందిన శ్రీసాయిపుత్ర హోమ్స్ అండ్ డెవలపర్స్ అధినేత శంకర్‌యాదవ్ తరిస్తున్నారు. గత రెండురోజులుగా శ్రీశైలమల్లికార్జున,భ్రమరాంబ దర్శనానికి వచ్చే భక్తులకు అన్నదానం చేస్తున్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా, శంకర్‌యాదవ్ శ్రీశైలంలో అన్నదానం చేస్తున్నారు. ప్రతియేడాది బ్రహ్మోత్సవాలలో పాల్గొని అన్నదానం చేయడాన్ని ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. ఇందులోభాగంగా ఈయేడాదిలో గత రెండురోజుల నుంచి అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ప్రతిరోజూ 8వేల నుంచి 10మంది భక్తులకు అన్నదానం చేస్తున్నారు. ప్రముఖపండితులు విశ్వంపంతులు శంకర్‌యాదవ్‌ను శాలువాతో శివునివిగ్రహాన్ని అందించి ఘనంగా సన్మానించారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని శంకర్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శంకర్‌యాదవ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఈకార్యక్రమంలో బిసిసంఘం కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్, మాజీ ఎంపిపి రాములుయాదవ్,మిత్రులు జొన్నల వినోద్, వేణుగోపాల్ రెడ్డి, మనోహర్‌యాదవ్,తండ్రి బానోళ్ల హనుమయ్,కుమారుడు అభినవ్ సాయి,బంటు మల్లప్ప, చెంగోల్ మాజీ ఎంపీటీసీ రాము, మేనల్లుడు అరవింద్‌యాదవ్, మల్‌రెడ్డి,శ్రీను, కిరణ్‌యాదవ్,శ్రీనివాస్ రెడ్డి,విట్టల్, నరసింహులుగౌడ్, కళ్యాణం చందు, కల్వ ఉమాశంకర్, శ్రీకాంత్ మధుసూదన్‌రెడ్డి, పికె మల్లేష్ వెంకటేష్, చెంగోల్ గోపాల్, రఘునాథ్ రెడ్డి, మహేందర్, అరుణ్‌కుమార్, అనిల్, యాదయ్య, అంజి,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టుల అందజేత

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

శంకర్‌పల్లి మున్సిపాల్టీ సింగాపురం వార్డుకు చెందిన మాజీ సర్పంచ్ లచ్చయ్య కుమారుడు ప్రతాప్, గ్రామ మాజీ సర్పంచ్ మున్నూరు లక్ష్మణ్‌లు కలిసి గురువారం కబడ్డీ క్రీడాకారులకు టీషర్టులను అందజేశారు. వికారాబాద్ జిల్లాకేంద్రంలో 34వ రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాపోటీలు జరగనున్నాయి. ఈసందర్భంగా సంగారెడ్డిజిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులకు జెర్సీ టీషర్టులను పంపిణీచేసి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. క్రీడాకారులను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలన్నారు. క్రీడాకారులు కబడ్డీ అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎర్రోళ్ల శివకుమార్, రుద్రారం శ్రీధర్, చాకలి నరసింహ, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, జిల్లా అధ్యక్షులు ముక్తార్ జానీ, ఆర్గనైజ్‌సెక్రటరీ శివయ్య, క్రీడాకారులు నారాయణ,నవీన్,సురేష్, గౌతమ్,సంతోష్,సందీప్,అసోసియేషన్ కమిటీసభ్యులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర హ్యాచరీస్ ఔదార్యం

-కళాశాల నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రూ.25లక్షల విరాళం



ఎమ్మెల్యేకు చెక్కును అందజేస్తున్న వెంకటేశ్వర హ్యాచరీస్ ఉద్యోగులు

షాద్‌నగర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వారా ఈ ప్రాంత విద్యార్థులకు విద్యను అందించేందుకు షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ కళాశాల నిర్మానాన్ని చేపడుతున్న క్రమంలో దాతలు విరాళాలు పెద్దఎత్తున అందజేస్తున్నారు. పేద విద్యార్థులకు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ఉండాలని కళాశాల నిర్మానానికి ఆర్థిక సహాయం చేస్తున్నారు. గురువారం వెంకటేశ్వర హ్యాచరీస్ యాజమాన్యం రూ.25 లక్షల విరాళాన్ని ప్రకటించగా, హ్యాచరీస్ జనరల్ మేనేజర్ కేజీ ఆనంద్, ఫైనాన్షియల్ మేనేజర్ శ్రీనివాసరావులు ఎమ్మెల్యేకు రూ.25లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు చెంది తిరుపతిరెడ్డి, అల్వాల్ రెడ్డి, రవికుమార్, లింగారెడ్డిగూడెం అశోక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి..

పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కండ్లకోయ, జోగిపేట్, ఆందోల్ మండలం, సంగారెడ్డికి చెందిన గంజి ఎల్లాదాస్ (41) గత 15సంవత్సరాల క్రితం బ్రతుకుతెరువుకై భార్యపిల్లలతోకలిసి మేడ్చల్‌లో నివాసం ఉంటున్నాడు. కాగ గురువారం తన హోండా బైక్‌పై (ఏపీ 10 ఏయూ 1435) మేడ్చల్ నుండి కొంపల్లి వైపు వస్తుండగా మార్గమ ధ్యలో రాజారాజేశ్వరి టెంపుల్ వద్దకు రాగానే ఒక డీసీఎం (టీఎస్ 09 యూ 6667) అతివేగంగా వచ్చి వెనుకనుం డి ఢీ కొట్టడంతో అతనికి తీవ్ర గాయా లు కావడంతో శ్రీమేరు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు డాక్టర్లు